కూటమి సర్కార్ అధనపు కిక్కు

- బాటిల్‌కు అదనంగా రూ.10 బాదుడు
- బ్రాందీషాపుల్లో పర్మిట్ రూంలు
- ఎల్‌ఈడీ స్క్రీన్‌లు.. ఐపీఎల్ మ్యాచ్‌లు
- బార్‌లను మించిపోతున్న బ్రాందీషాపులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు


పట్టణంలోని ఒక బ్రాందీషాపు వద్ద రోడ్డు మీదనే బైక్‌పై గ్లాసులు పెట్టుకుని మద్యం తాగుతున్న యువకులు


మద్యం షాపు వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

రామచంద్రపురం: 'మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. మద్యం ధరలు తగ్గిస్తాం... తమ్ముళ్లు మీరందరూ రాత్రికి ఒక క్వార్టర్ తాగి హాయిగా పడుకోవచ్చు.' అంటూ ద్రాక్షారామలో ఎన్నికల సమయంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో నారా చంద్రబాబునాయుడు అన్న మాటలివి...'' కానీ తీరా ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏర్పాటు చేసిన బ్రాందీ షాపుల్లో ధరలు చూసి మందుబాబులకు కూటమి సర్కారు వారి సారా కిక్కు మత్తుదిగేలా చేసింది. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోయినా అందరికీ అందుబాటులో మందు పథకాన్ని తీసుకువచ్చిన కూటమి సర్కారు అంచెలంచెలుగా మందుబాబులకు షాక్ ఇస్తుంది. బ్రాందీ షాపులు ఏర్పాటు చేసినప్పుడు ఒక రేటు ఉంటే తాజాగా బాటిల్‌కు అదనంగా రూ.10 మందుబాబులపై బాదుడు కార్యక్రమం చేపట్టింది. గత ప్రభుత్వం కన్నా తక్కువ ధరకే మద్యం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం బ్రాందీషాపుల సిండికేట్లకు తలొగ్గుతూ రేట్లు పెంచి ప్రజల వద్ద నుంచి ఇష్టారాజ్యంగా దోచుకునేలా చేస్తుంది. లక్షల రూపాయలు పెట్టి వేలం దక్కించుకున్న కూటమి నేతలు ఎలాగైనా ఖర్చు చేసిన డబ్బులు బ్రాందీషాపుల ద్వారా తీయాలనే ధ్యేయంతో ప్రతి షాపును ఒక బార్‌గా మార్చే ప్రక్రియకు తెరతీసినా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు కిక్కురు మనకుండా చోద్యం చూస్తున్న వైనం విమర్శలకు దారి తీస్తుంది. రామచంద్రపురం, మండపేట నియోకవర్గాల్లో కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం అర్బన్, రామచంద్రపురం రూరల్, మండపేట అర్బన్, మండపేట రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో సుమారుగా 30 వరకు బ్రాందీషాపులు వెలిశాయి. గత ప్రభుత్వం హయాంలో జనావాసాలకు ప్రధాన రహదారులకు దూరంగా ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ప్రధాన రహదారులకు ఆనుకుని షాపులు ఏర్పాటు చేశారు. నిత్యం ప్రజలు సంచరించే వీధుల్లోను షాపులు ఉండటం ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. కళాశాలలు, దేవాలయాలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఇవేమీ అధికారులకు కనపడటం లేదు. కాలనీలకు వెళ్లే రోడ్ల పక్కనే బ్రాందీషాపులు పెట్టడంతో మద్యం బాబులు షాపులు బయటే బైక్‌లపై మందు గ్లాసులు పెట్టుకునే తాగుతున్న వైనం. దీంతో ఆ దారిలో వెళ్లే మహిళలు, ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. దీనిపై అధికారులకు విన్నవించుకున్న ఫలితం శూన్యం.

బ్రాందీషాపుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు.. ఐపీఎల్ మ్యాచ్‌లు

మద్యం బాబులను ఆకర్షించి తమ షాపుల్లో మద్యం సేల్‌ను పెంచుకునేందుకు బ్రాందీషాపుల యజమానులు రకరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. షాపుల పక్కనే పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేస్తూ బార్‌లకు మించి పోయే విధంగా సకల సౌకర్యాలే చేస్తున్నారు. అందులో భాగంగానే ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి తీరుబడిగా మద్యాన్ని తాగే విధంగా చేస్తున్నారు. ఇటీవల బ్రాందీ షాపుల్లో ఎల్ ఈడీ స్క్రీన్‌లు కూడా ఏర్పాటు చేసి మద్యంతో పాటుగా క్రికెట్ కిక్‌ను కూడా అక్కడే ఏర్పాటు చేయటంతో ఇంకేముంది మందుబాబులకు పండగే. బ్రాందీషాపుల వద్ద చేస్తున్న సకల సౌకర్యాలు మరి ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఎలా అనుమతిస్తున్నారనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు జరగాల్సిన సోషల్ పరీక్ష రేపటికి వాయిదా

రాయవరం: పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం జరగాల్సిన చివరి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం నాటికి వాయిదా పడింది. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పరీక్షల విభాగం ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేసింది. జిల్లాలోని 110 పరీక్ష కేంద్రాల్లో సోషల్ స్టడీస్ పరీక్షకు 18,614 మంది రెగ్యులర్, 216 మంది విద్యార్థులు ప్రైవేట్‌గా పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. మంగళవారం జరిగే సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పరీక్షలు ముగుస్తాయి.

ఘనంగా అమ్మవార్ల సంబరాలు


ద్రాక్షారామలో బియ్యంపేట తలుపులమ్మను దర్శించుకున్న పిల్లి సూర్యప్రకాశ్, ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గ్రామ దేవతలు తలుపులమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల తీర్థం, సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తలుపులమ్మ ఆలయం వద్ద రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద సిరిమానోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభించిన వెంకటరమణ, ఎస్సై నాగేశ్వరరావు


రామచంద్రపురం: ఉగాది పర్వదినం సందర్భంగా లయన్స్ క్లబ్ రామచంద్రపురం వికాస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో బలుసు కల్యాణ మండపం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ ప్రెసిడెంట్, వికాస్ విద్యా సంస్థల అధినేత వాసంశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ప్రారంభించారు. వెంకటరమణ మాట్లాడుతూ రాబోయే రెండు నెలల వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం శిబిరం ప్రారంభించామన్నారు. తొలి రోజు క్లబ్ సభ్యుల సహకారంతో సుమారు 800 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతీ రోజు 500 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి క్లబ్ సెక్రటరీ వాసంశెట్టి చంద్రబాబు, ట్రెజరర్ గుణ్ణం నవీన్‌కుమార్, క్లబ్ సభ్యులు కడియాల రాఘవన్, దంగేటి గౌరీశంకర్, బ్రహ్మం శ్రీను, రామచంద్రపురం క్లబ్ నాయకులు గోలి చిట్టిబాబు, గుణ్ణం రామకృష్ణ పాల్గొన్నారు

ముగిసిన నూకాలమ్మ ఉత్సవాలు


అంగరలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: అంగరలోని నూకాంబిక అమ్మవారికి భక్తులు నైవేద్యం సమర్పించారు. ఈ నెల 28న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అమ్మవారికి పండ్లు, పూలు, చీర సమర్పించారు. ఆలయ ఆసాదులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. దూరపు ప్రాంతాల్లో స్థిరపడిన ఆయా గ్రామాలకు చెందిన ఆడపడుచులు కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించారు. జాతర ఉత్సవాలు విజయవంతం చేసినందుకు ఇరు గ్రామాల భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పురస్కార గ్రహీతకు అభినందనలు


స్వామి ప్రసాద్

మండపేట: మండలంలోని ద్వారపూడి ప్రభుత్వ పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అభ్యుదయ సాహితీవేత్త గండి స్వామి ప్రసాద్‌కు ఉగాది సాహితీ పురస్కారం లభించింది. ఉగాది సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పురస్కారం అందుకున్నారు. పలువురు ప్రముఖులు, ప్రభుత్వ పెద్దలు ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తాను పనిచేస్తున్న పాఠశాల హెచ్ఎం సవితాల సుబ్రహ్మణ్యం, ప్రముఖ సాహితీవేత్త, కవి బండారు రాము, వర్ధమాన కవి తూలూరి సరేంద్ర, జన విజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి గొడవర్తి సుధాకర్ తదితరులు స్వామిప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి విద్యుత్ మీటర్ రీడర్ల సమ్మె


గొల్లపాలెం సబ్‌స్టేషన్లో యూడీసీకి సమ్మె నోటీసు అందజేస్తున్న సంఘ నాయకులు

కాజులూరు: ఎన్నికల ముందు తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు మాట ఇచ్చి మోసం చేశారని ఇప్పుడు తమకు న్యాయం జరిగే వరకూ సమ్మె చేపట్టనున్నామని విద్యుత్ మీటర్ల రీడర్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంఘ నాయకులు ఎం.బాబూరావు, పోతుల సత్యకిశోర్ తదితరులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో మీటర్లకు రీడింగ్ తీసే పనిచేస్తున్నామని ఇప్పుడు స్మార్ట్ మీటర్ల వలన తాము ఉపాధి కోల్పోయి రాష్ట్ర వ్యాప్తంగా 4600 కుటుంబాలు వీధిన పడతాయన్నారు. దీనిపై తమ సంఘం రాష్ట్ర నాయకులు గతంలో ఆందోళనలు చేపట్టగా తాము అధికారంలోనికి వస్తే ఉద్యోగ భద్రత కల్పించే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయిస్తామని కూటమి నేతలు పవన్‌కళ్యాణ్, లోకేష్, చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. తీరా ఇప్పుడు నేతలు మాట తప్పటంతో ఏప్రిల్ ఒకటో తేది నుంచి సమ్మె చేయనున్నట్టు ప్రకటిస్తూ గొల్లపాలెం సబ్‌స్టేషన్‌లో యూడీసీకి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సంఘ నాయకులు వి.సత్యనారాయణ, వి.సురేష్‌కుమార్, కె.శ్రీను, కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధం


రంజాన్ వేడుకలకు ముస్తాబైన మసీదు


ద్రాక్షారామ పెద్ద మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న సూర్యప్రకాశ్, పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు


మస్జీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

- మసీదుల్లో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత
- నేడు ప్రత్యేక ప్రార్థనలు

రాయవరం: ఇస్లాం మతంలో రంజాన్ మాసానికి ప్రత్యేకత ఉంది. ముస్లింపులు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు సోమవారం ముగింపు రోజు. రంజాన్ మాసంలో దివ్య ఖురాన్ భువిపై అవతరించింది. అందుకే ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ మాసం అంతా ఉపవాస దీక్షలు చేస్తారు. నెల రోజుల పాటు ముస్లింలు సూర్యోదయానికి ముందు నుంచి సూర్యాస్తమయం వరకూ కఠోర దీక్షలు పాటించి భక్తి భావంతో ప్రత్యేక నమాజులను ఆచరిస్తున్నారు. ప్రతి రోజు ఐదు పూటల నమాజులతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ, దివ్య ఖురాన్‌ను పఠిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ రాత్రి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. క్లస్టర్ పరిధిలో ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.

మసీదులు ముస్తాబు

మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను పాటిస్తున్నారు. వెదురుపాక, లొల్ల, రాయవరం, చెల్లూరు, పసలపూడి తదితర గ్రామాల్లో మస్జీదుల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేయడమే కాకుండా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దివ్య ఖురాన్, హదీస్ ఇస్లాంకు పవిత్ర మత గ్రంథాలు. దైవ ప్రార్థనలు చేయడం, మద్యపానానికి దూరంగా ఉండడం, అబద్ధమాడక పోవడం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని గ్రంథాలు బోధిస్తున్నాయి. ఉపవాసం ఆచరించే వారంతా తెల్లవారుజామున తీసుకునే సహరి నుంచే దైవచింతనలో గడుపుతారు. పగలంతా ఉపవాస దీక్షను ఆచరించడం, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ చేసాక రాత్రి ప్రత్యేక తరావీ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. జకాత్ రూపంలో దాన ధర్మాలు చేసి పేదలను ఆదుకోవడం, పేదవాని ఆకలి తీర్చడం కోసం ముస్లింలు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నారు.

ఐక్యతకు ప్రతీకలుగా ఇఫ్తార్ విందులు

రామచంద్రపురం రూరల్: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం ద్రాక్షారామ పెద్ద మసీదులో ముస్లిం పెద్దలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో యువనాయకుడు తోట పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, సర్పంచ్ అంబటి తుకారం వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి శ్యామ్, కర్రి రవీంద్ర, పెమ్మిరెడ్డి మురళీ, చల్లా బుజ్జి, యండమూరి ఈశ్వరరావు, అడవి కుమార్, నున్న కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు సాధిక్‌హుస్సేన్, ముస్లిం పెద్దలు అబ్దుల్ ఘనీ, అలీహుస్సేన్, గుల్జార్ హుస్సేన్, మాది హుస్సేన్, మత గురువు మౌలానా మీర్జా అస్కరిహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం కోసమే రంజాన్

బిక్కవోలు: ముస్లింలకు పండగలలో ముఖ్యమైనవి రంజాన్. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రంజాన్ మాసంలోనే అవతరించింది. మానవ జాతికి రంజాన్ మాసంతో మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే రోజు, ఇదే నెలలో ఉపవాస వ్రతాన్ని కూడా దైవంగా ఈ నెలలోనూ విధిగా చేశారు. పేద, ధనిక బేధం లేకుండా ప్రతి ముస్లిం సంతోషంగా జరుపుకొంటారు. సోమవారం రంజాన్ జరుపుకొనేందుకు ముస్లింలందూ సిద్ధమయ్యారు. అన్ని ఏర్పాట్లను చేసుకున్నారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం, సింగంపల్లి, రంగంపేట, జి.మామిడాడ, పెదపూడి, పలు మసీదుల్లో సోమవారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజులు చేస్తారు. అనంతరం పేదలకు దానాలు చేస్తారు.

యువత దేశానికి వెన్నెముక


వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో శ్రీనివాసచౌదరి, రఘువీరానంద మహరాజ్ తదితరులు

రాయవరం: యువత దేశానికి వెన్నెముక వంటివారని, అటువంటి యువతలో వ్యక్తిత్వ వికాసం ముఖ్యమని విజయవాడకు చెందిన రఘువీరానంద మహరాజ్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని లొల్లలో విశ్వమానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యువతకు పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రఘువీరానంద మహరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. ప్రతి విద్యార్థి దైనందిన జీవితంలో జ్ఞాపక శక్తి, మనో నిగ్రహ శక్తి, ఏకాగ్రత, కృషి, పట్టుదలతో లక్ష్యం వైపు పయనించాల్సిన అవసరం ఉందన్నారు. యువత కోసం వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరిని మహరాజ్ అభినందించారు. విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని, సమాజాన్ని ముందుకు నడిపించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు సంస్కార విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి విజయానికి రాజపథం అనే అంశంపై అవగాహన కల్పించారు. సమావేశంలో విశ్వమానవత సంస్థ ప్రిన్సిపాల్ పి.జనార్దనరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండగ రోజూ తప్పని పాట్లు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


మండపేటలో దీక్ష చేస్తున్న మహిళలు

మండపేట: ఓ పక్క ప్రజలు ఉగాది వేడుకలు జరుపుకుంటుంటే మరోపక్క మండపేటలో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పండగ పూట కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో మండుటెండలో ఆందోళన చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ వారికి కంటిమీద కునుకు లేకుండా చేసింది. నివాస ప్రాంతాల మధ్య వైన్ షాపు వద్దంటూ సుమారు 15 రోజులకు పైగా పోరాడుతున్నారు. దీనిలో భాగంగా 28, 29, 30 మూడు వార్డుల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం తొమ్మిది రోజూ కొనసాగాయి. ఆయా వార్డుల మహిళలు ఉగాది పండుగను కూడా వదులుకుని సప్తగిరి థియేటర్ ఎదురుగా దీక్ష చేశారు. వైన్ షాపు ఇక్కడి నుంచి పోయినప్పుడే తమకు అసలైన పండుగని తెగేసి చెప్పారు.

ఘనంగా ఉగాది వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగ పఠనం చేసిన పండితులు
- గ్రామాల్లో సందడి వాతావరణం


ఉగాది పారితోషకాలు అందుకున్న వృద్ధులతో ట్రస్ట్ సభ్యులు

రామచంద్రపురం: ఉగాది సందర్భంగా గాయత్రీ బ్రాహ్మణ సమితి ట్రస్ట్, త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షులు విల్లూరి కృష్ణనందమూర్తి సభకు స్వాగతం పలుకగా త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ డైరెక్టర్లు అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు, వెంకటరామన్‌లతో జ్యోతి ప్రజ్వలన చేయించి బ్రహ్మశ్రీ అమ్మావజ్ఝల సీతారామయ్యతో పంచాంగ పఠనం చేశారు. అనంతరం ట్రస్ట్ సెక్రటరీ తటవర్తి శ్రీనివాస్, కోశాధికారి ఆరాధి శ్రీధర్ తదితరుల చేతుల మీదుగా త్యాగరాజ సంగీత సభ బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రముఖ కవి బంధకవి రామారావు, గాయకులు చెరుకూరి రామ్మూర్తిలు చదివిన ఉగాది కవితలు, పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. అల్పాదాయం గల సుమారు 30 మంది వృద్ధులు, వికలాంగులకు ఉగాది నగదు పారితోషికాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యవాడ శ్రీహరి పంతులు, బులుసు సూరిబాబు, మానాప్రగాఢ రతిమోహన్, మల్లాది కాశీనాథ్, గొర్తి రాజేశ్వరి ప్రసాద్, పొక్కులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. త్యాగరాజ సంగీత సభ భవన నిర్మాణానికి టీఎస్ వెంకటరమన్ రూ.6 లక్షలు చెరుకూరి రామ్మూర్తి రూ.50,000, విరాళం ఇచ్చినట్లు సెక్రటరీ తటవర్తి శ్రీనివాస్ వెల్లడించారు.

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం ఆంధ్రుల తెలుగు సంవత్సరాది ఉగాది పండగ కార్యక్రమాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి విశ్వావసునామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటా షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడిని తయారు చేసుకుని ఆరగించారు. మామిడి తోరణాలు, పూల అలంకరణలతో ప్రతి ఇల్లు కళకళలాడాయి. ఒకరికొకరు పరస్పరం తెలుగు సంవత్సరాది, ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల ప్రజలు ఆదివారం ఉగాది పండుగను సంతోషంగా జరుపుకున్నారు. పుణ్యస్నానమాచరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. అంగరలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పండితులు పంచాంగ పఠనం చేశారు. గ్రామాల ప్రధాన సెంటర్లలో ప్రజా, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కపిలేశ్వరపురం, తాతపూడి, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, నల్లూరు, టేకి, కాలేరు, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు ఆడపడుచులు నైవేదాలు సమర్పించారు.

మంచి పనులకు శ్రీకారం చుట్టాలి

రాయవరం: నూతన సంవత్సరంలో దైవ చింతనతో మంచి పనులకు శ్రీకారం చుట్టాలని వెదురుపాక విజయదుర్గా పీఠాదిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు పిలుపునిచ్చారు. విజయదుర్గా పీఠంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలు కలగాలని ఆశించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి గాడ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో భక్తులు అమ్మవారిని కొలవడం వలన సకల శుభాలు జరుగుతాయన్నారు. పీఠంలో వేద పండితులు పంచాంగ పఠనం చేశారు.

రామచంద్రపురం రూరల్: ఉగాది పర్వదినం పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సంబరాలు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ అల్లు వెంకటదుర్గాభవాని, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణల చేతుల మీదుగా పంచాంగ పూజ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి అరవ విస్సు నేతృత్వంలో కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని కవులను, ఆలయ ప్రధాన అర్చకులు కల్లేపల్లి ఫణికుమార్, ఇతర అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, హోమ పురోహితులకు సత్కరించి పురస్కారాలు అందజేశారు. సాయంత్రం మేడవరపు గోపాలకృష్ణ పంచాంగ పఠనం చేశారు. మాణిక్యాంబా అమ్మవారికి వసంత నవరాత్ర ఉత్సవాలు పురస్కరించుకుని విశేష సువర్ణ, రజత పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, ప్రసాద వితరణ చేశారు.


ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారికి సువర్ణ, రజత పుష్పాలతో అర్చన చేస్తున్న ఆలయ అర్చకులు


వసంతమాతగా అలంకృతులైన విజయదుర్గా అమ్మవారు

పీఠంలో వసంతనవరాత్రులు ప్రారంభం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో వసంత నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వసంతమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చే నెల ఏడో తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి లక్ష్మీతులసి పూజ నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామాహిక కుంకుమ పూజలు నిర్వహించారు. విజయదుర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.


వెదురుపాకలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న పీఠాధిపతి గాడ్


అంగరలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు వెంకటేశ్వరరావు


వేపపువ్వుతో తయారు చేసిన ఉగాది పచ్చడి


ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో కవులను సత్కరిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్


విజయదుర్గా పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు